
ఆంధ్రజ్యోతి

andhrajyothy.com ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 36.3, కనిష్ఠం 27.7

నిర్మల్ జిల్లా వార్తలు


6

సోమవారం 19 మే 2025



## భూభారతి దరఖాస్తుల స్వీకరణకు నేడు ఆఖరి రోజు

కుంటాల, మే, 18 (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలం భూభారతి పైలట్ ప్రాజెక్టులో ఎంపికైనందున అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రైతులకు సంబంధించిన పలు రకాల భూ సమస్యలను పరిష్కరించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని సోమవారం ఆఖరిరోజని తహసీల్దార్ కమల్ సింగ్ అన్నారు. ఇది వరకు దరఖాస్తులు సమర్పించని రైతులు ఏవైనా భూ సమస్యలుంటే అందజేయాలని తెలిపారు. కుంటాల మండలంలో గత 15 రోజుల నుంచి అన్ని గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తూ ఇప్పటి వరకు 587 దరఖాస్తులు స్వీకరించామన్నారు.



- ఇంకా వెలువడని బాసర ట్రిపుల్ ఐటీ ప్రవేశ నోటిఫికేషన్
- యూనివర్సిటీ అధికారుల తీరుతో విద్యార్థుల అయోమయం
- ప్రత్యామ్నాయాల వైపు విద్యార్థుల చూపు
- నష్టపోతున్న విద్యార్థులు.. తగ్గిపోతున్న దరఖాస్తులు

# ఎదురు చూపులు

బాసర, మే 18 (ఆంధ్రజ్యోతి): బాసర వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ట్రిపుల్ ఐటీలో ప్రవేశ నోటిఫికేషన్ కోసం విద్యార్థులకు ఎదురు చూపులు తప్పడం లేదు. స్టేట్ సీబీఎస్సీ ఎస్సెస్సీ ఫలితాలు విడుదలైనప్పటికీ నోటిఫికేషన్ రాకపోవడం సమస్యగా మారింది. యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యం మూలంగా రాష్ట్రవ్యాప్తంగా ఎస్సెస్సీ విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు. పదోతరగతిలో వచ్చిన మార్కులు, గ్రేడు ఆధారంగా ప్రవేశాలు కల్పించే యూనివర్సిటీ ప్రవేశ ప్రక్రియ ఇంకా ప్రారంభించక పోవడంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి తీవ్ర అసంతృప్తి వెలువడుతోంది. గతేడాది ఇలాగే జాప్యం కారణంగా గణనీయంగా దరఖాస్తుల సంఖ్య తగ్గిపోయింది. ఆలస్యమవడంతో విద్యార్థులు ప్రత్యామ్నాయ ఇంటర్, పాలిటెక్నిక్ వంటి కాలేజీల్లో చేరిపోయారు. యూనివర్సిటీలో లోపం కారణంగా గ్రామీణ ప్రతిభగల విద్యార్థులు నష్టపోయే పరిస్థితి నెలకొంది.

### యూనివర్సిటీలో అస్తవ్యస్త పరిస్థితి

రాష్ట్రంలో ఉన్న ఒక్క ట్రిపుల్ ఐటీలో రెగ్యులర్ వీసీ లేకపోవడం గత కొన్నేళ్ల నుంచి పెద్ద సమస్యగా మారింది. వీసీ తర్వాత ఉన్నత అధికారులైన డైరెక్టర్, పరిపాలనాధికారి వంటి పోస్టుల్లో కూడా ఇన్‌చార్జి అధికారులు ఉండటం ఏడాది, రెండేళ్లకోసారి కొత్తవారు రావడంతో గత రెండు, మూడేళ్ల నుంచి పరిపాలన అస్తవ్యస్తంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రవేశ ప్రక్రియ కూడా సజావుగా జరగడం లేదు. గతంతో పదో తరగతి ఫలితాల కంటే ముందుగానే ట్రిపుల్ ఐటీ నోటిఫికేషన్ విడుదల చేసేవారు. పదో తరగతి హాల్ టికెట్ నెంబరుతో దరఖాస్తులను స్వీకరించి ఫలితాలు రాగానే మార్కుల ఆధారంగా ప్రవేశాలు కల్పించే వారు. జూన్ కల్లా కౌన్సెలింగ్ పూర్తిచేసి తరగతులు ప్రారంభించేవారు. గత ఒకటి, రెండేళ్ల నుంచి ప్రవేశ ప్రక్రియలో అధికారల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. మే నెలలో నోటిఫికేషన్ విడుదల చేసి ఆగస్టులో తరగతులను ప్రారంభి స్తున్నారు. ఇటు అడ్మిషన్ల ప్రక్రియ ఆలస్యమడంతో పాటు సిలబస్ పూర్తి చేయడంలో ఇబ్బందులు ఎదురువుతున్నాం. ఈ సారి కూడా ఫలితాలు వచ్చినప్పటికీ కనీసం నోటిఫికేషన్ విడుదల కాలేదు. నోటిఫికేషన్ వచ్చిన తర్వాత దాదాపు మూడు నుంచి నాలుగు వారాల పాటు దరఖాస్తుల స్వీకరణ మరో మూడు వారాలు కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ సారి కూడా ఈ అడ్మిషన్ ప్రక్రియ చూస్తుంటే జూలై చివరి లేదా ఆగస్టు మొదటి వారంలో తరగతులు ప్రారంభయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

### ప్రభుత్వం వద్ద అనుమతులు పెండింగ్

యూనివర్సిటీలో వెయ్యి మంది విద్యార్థుల ప్రవేశాలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు ఉన్నాయి. కానీ రాష్ట్రంలో ఒకటే ట్రిపుల్ ఐటీ ఉండటంతో సీట్ల సంఖ్యను పెంచాలని డిమాండ్ ఏర్పడింది. దీనికి తోడు ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు ట్రిపుల్ ఐటీలో నాలుగు వేల మంది విద్యార్థులకు ప్రతి యేడాది అక్కడ ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఇలాంటి పరిస్థితులో ఇక్కడ ఉన్న డిమాండ్ మేరకు అనుమతి ఉన్న వెయ్యి సీట్లకు



అదనంగా ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకొని మరో ఐదు వందల మందిని కలిపి మొత్తం 1500 ప్రవేశం కల్పిస్తున్నారు గతంలో నోటిఫికేషన్ విడుదల చేసి ఎంపిక జాబితా సమయానికి ప్రభుత్వం నుంచి అనుమతులు తెచ్చుకునే వారు కానీ ఈ సారి ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన తర్వాతనే నోటిఫికేషన్ విడుదల చేస్తామని ఆలోచనతో అధికారులు ఉండటంతో నోటిఫికేషన్ జాప్యానికి కారణం అవుతుంది. ఫిబ్రవరి నెలలో యూనివర్సిటీ అధికారులు నోటిఫికేషన్ గురించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ఇప్పటి వరకు అనుమతులు రాకపోవడతో అధికారులు నోటిఫికేషన్ విషయంలో ముందుకు వెళ్లడం లేదు. సీట్ల సంఖ్యను పేర్కొనకుండా నోటిఫికే షన్ విడుదల చేసి దరఖాస్తు స్వీకరణ ప్రక్రియ దాదాపు నెల రోజుల పాటు కొనసాగుతోంది. ఈలోగా ప్రభుత్వ అనుమతులు తీసుకొని తర్వా త ఎంపిక జాబితాను విడుదల చేసే అవకాశం ఉంటుంది.

### తగ్గిపోతున్న దరఖాస్తులు

రాష్ట్రంలో ఒకే సంస్థ ఉండటంతో ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు తీవ్ర పోటీ నెలకొంటుంది. ఒక్క సారి ప్రవేశం పొందితే నామమాత్ర ఫీజుతో ఇంటర్, ఇంజనీరింగ్ పూర్తి చేసే అవకాశం ఉండటంతో పదో తరగతి తర్వాత విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీలో ప్రవేశానికి మొదటి ప్రాధాన్యం ఇస్తారు. కానీ నోటికేషన్ జాప్యం వల్ల విద్యార్థులు పాలిటెక్నిక్, ప్రభుత్వ, ప్రైవేటు ఇంటర్ కాలేజీల్లో ప్రతిభ గల విద్యార్థులు చేరిపోతున్నారు. ప్రతిభ ఉన్నప్పటికీ యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యం మూలంగా పేద విద్యార్థులు బాసర ట్రిపుల్‌లో ప్రవేశాలకు నోచుకోవడం లేదు.

## మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వొద్దు

● ఎస్సై సంజీవ్



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై సంజీవ్

ముథోల్, మే 18 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని ముథోల్ ఎస్సై సంజీవ్ అన్నారు. మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో ఆదివారం మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని గ్రామస్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించాలన్నారు. అతి వేగం, నిర్లక్ష్యం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. ప్రతిఒక్కరూ ప్రమాదాల నివారణకు పాటు పడాలన్నారు. యువత వాహనాలను నడిపే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. యువత చెడువ్యసనాలకు దూరంగా ఉంటూ సన్మార్గంలో నడుస్తూ అమ్మనాన్న కన్నకలలను సాకారం చేయాలన్నారు. ఎవరైనా గంజాయి విక్రయించడం, సేవించడం నేరమన్నారు. ఎవరైనా అటువంటి వాటికి పాల్పడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనానికి హాజరైన పూర్వవిద్యార్థులు

నిర్మల్అర్బన్, మే 18 (ఆంధ్రజ్యోతి) : 25 ఏళ్ల క్రితం పదో తరగతి వరకు కలిసి చదువుకున్నారు.. ఆ తర్వాత చదువులు, ఉద్యోగాల కోసం విడిపోయారు. సరిగ్గా ఇప్పుడు 25 ఏళ్ల తర్వాత మళ్లీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి కలుసుకున్నారు. నిర్మల్ పట్టణంలోని జుమ్మెరాత్‌పేట్ ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం ఈ అపూర్వసమ్మేళనానికి వేదికైంది. 1999-2000ల బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఈ రజతోత్సవ వేడుకల్లో ఎంతో ఉల్లాసంగా గడిపారు. తమ చిన్ననాటి స్నేహితులను కలుసుకుని భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం తమకు చిన్ననాటి పాఠాలు బోధించి తమ ఉన్నతికి పాటుపడిన ఉపాధ్యాయులను సన్మానించి వారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగాచారి, జనార్ధన్, దేవరాజ్, శివలింగయ్య, రవి కుమార్, చక్రవర్తి, సంజీవ్ రెడ్డి, రవిబాబు, పూర్వ విద్యార్థులు రవీందర్, అనిల్, నరేందర్, చారి, వినయ్, మహేందర్, నరేష్, శ్రీదేవి, రాధిక, కవిత, తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ తైక్వాండోకు గుర్తింపు

నిర్మల్‌రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి) : భారతీయ తైక్వాండోకు వరల్డ్, ఆసియా తైక్వాండో గుర్తింపు ఉందని అసోసియేషన్ సెక్రటరీ దాయత్ అక్షయ్ అన్నారు. ఇండియా తైక్వాండోను భారత ప్రభుత్వం యువజన వ్యవహారాల క్రీడల మంత్రిత్వ శాఖ అధికారికంగా గుర్తించిందని తెలిపారు. ఈ సందర్భంగా కేక్‌కట్‌చేసి, టపాసులు పేల్చి సంబరాలు చేసుకు న్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు మహే శ్వర్, వహాజ్అలీ, నాగరాజు, అసోసియేషన్ అధ్యక్షులు సోమే శ్వర్ పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న తైక్వాండో క్రీడాకారులు

## రైతులను మోసం చేస్తే ఊరుకునేది లేదు

● బీజేపీ నాయకులు

మామడ, మే 18 (ఆంధ్రజ్యోతి) : రైతులను ధాన్యం కేంద్రాల్లో మోసం చేస్తే ఊరుకునేది లేదని బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు న్యాయవాది రంజిత్ కుమార్ అన్నారు. ఆదివారం ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి కొనుగోలు కేంద్రాన్ని బీజేపీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు. 40 కిలోల సంచి మీద నాలుగు కిలోల ధాన్యాన్ని అధికంగా తూకం వేస్తున్నారని ఆ డబ్బు ఎవరి ఖాతాలోకి వెళ్తుందని ప్రశ్నించారు. సెంటర్‌ను చూసి అక్కడ సరిపడా గన్ని బ్యాగులు గాని టార్పాలిన్లు గాని లేవని, వర్షాలు వస్తున్నాయి. ఇప్పటికీ ధాన్యం రైస్ మిల్లుకు పంపలేదన్నారు. ఇలాంటి నిర్లక్ష్యంతో రైతులు నిండా మునిగే ప్రమాదముందని ఆరోపించారు. మ్యాచర్ వచ్చి 20 రోజులు గడిచిన ఇప్పటి వరకు గన్ని బ్యాగులు ఇస్తలేరు. తక్షణమే రైతులకు సరిపడా గన్ని బ్యాగులు ఇచ్చి వెంటనే వడ్లని జోకాలని, లారీల కొరతతో అన్నదాతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పీఏసీఎస్ డీసీఎంఎస్ ఇచ్చి రాజకీయంగా లబ్ధి చేకూర్చుకుంటున్నారని ఆరోపించారు. వెంటనే వడ్లని కల్లాల మీద నుంచి జోకి రైస్‌మిల్లుకు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు పాటుకూరి బాపురెడ్డి, బీజేపీ పార్టీ మండల అధ్యక్షులు ఏలేటి చిన్నారెడ్డి, నాయకులు గోవర్ధన్ రెడ్డి, నర్సాపూర్ గంగారెడ్డి, భీమ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కొరటికల్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

## రవీంద్ర భారతిలో చిన్నారుల నృత్య ప్రదర్శన



నృత్య కళాకారులతో గురువు నవ్య వినయ్ కుమార్

నిర్మల్ రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఆదివారం నిర్వహించిన శ్రీశ్రీశ్రీ తాళ్లపాక అన్నమయ్య 617వ జన్మదిన వేడుకల సందర్భంగా నిర్వహించిన నృత్య ప్రదర్శనలో పట్టణంలోని భాగ్యనగర్‌కు చెందిన స్వరూపిణి నృత్య కళాక్షేత్రంకు చెందిన 18 మంది చిన్నారులు తమ నృత్య ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకున్నారు. ఈ మేరకు నిర్వాహకులు ప్రశంసా పత్రం, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా నృత్య శిక్షకురాలు సంగినేని నవ్య వినయ్ కుమార్ చిన్నారులను అభినందించారు.

## గజ్జలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



గజ్జలమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కుంటాల, మే, 18 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాల స్థానిక గజ్జలమ్మ ఆలయానికి ఆదివారం భక్తజనం పోటెత్తింది. వర్షాకాలం సమీపిస్తుండడంతో రైతులు గజ్జలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతియేటా వర్షాకాలం ప్రారంభానికి ముందు ఖరీఫ్ సీజన్‌లో రైతులు విత్తనాలు వేసుకునే సమయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ వస్తుండడం సంప్రదాయం. ఇందులో భాగంగానే ఆదివారం రోజు అధిక సంఖ్యలో రైతులు కుటుంబ సమేతంగా ఆలయానికి వచ్చి గజ్జలమ్మకు ప్రీతిపాత్రమైన నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

## నేడు నిర్మల్ నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం

నిర్మల్ రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం సోమవారం ఉంటుందని డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు తెలిపారు. మండలంలోని రత్నాపూర్ కాండ్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోండ్రు రామ్‌రెడ్డి సోమవారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో గల రైతు వేదికలో ఉదయం 10 గంటలకు చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం ఉంటుందని తెలిపారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతు లు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని తెలిపారు.



శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

## ఘనంగా కాల్వ లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం

దిలావర్‌పూర్, మే 18 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని అశ్వరథంపై పుర వీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి బ్రహ్మరథం పట్టారు. దారి పొడవునా స్వామివారికి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి... గోవిందా... గోవిందా... నామస్మరణతో కాల్వ వీధులు మార్మోగాయి. స్వామివారి రథం లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తలు, ప్రధాన అర్చకులు రామానుజ శ్రీనివాస్, రాము, వెంకటేష్, దేవస్థానం ఈవో భూమయ్య, జూనియర్ అసిస్టెంట్ మనోహర్, వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు, కాల్వ గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే రామారావ్ పాటిల్‌పై అర్థరహిత ఆరోపణలు చేస్తే సహించేది లేదు

● బీజేపీ భైంసా పట్టణ, మండల ప్రతినిధులు



సమావేశంలో పాల్గొన్న భైంసా పట్టణ, మండల బీజేపీ ప్రతినిధులు

భైంసా, మే 18 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, ప్రగతియే లక్ష్యంగా పెట్టుకొని అందుకు అనుగుణంగా అలుపెరుగని రీతిలో అహర్నిశలు పాటుపడుతున్న ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్‌పై అర్థరహిత ఆరోపణలు చేస్తే సహించేది లేదని బీజేపీ భైంసా పట్టణ, మండల ప్రతినిధులు వెల్లడించారు. ఆదివారం ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో బీజేపీ భైంసా పట్టణ, మండల అధ్యక్షులు రావుల రాము, సిరం సుష్మారెడ్డి, జిల్లా కార్యవర్గసభ్యులు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. శనివారం భైంసా మండలంలోని మహాగాం గ్రామంలో కొనుగోలు కేంద్రం వద్ద బీఆర్ఎస్ ముథోల్ నియోజక వర్గ సమన్వయ కమిటీ ప్రతినిధి డా. కిరణ్ కోమ్రేవార్ రాజకీయ పరిజ్ఞానం లేకుండా ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్‌పై వ్యక్తిగత విమర్శలు, సత్యదూరమైన ఆరోపణలు చేసారని పేర్కొన్నారు. వ్యక్తిగత రాజకీయ లబ్ధి, ఎదుగుదల కోసంపరిపక్వత లేకుండా ఇష్టారాజ్యంగా మాట్లాడటం సరికాదన్నారు. పది రోజులకో పర్యాయం నియోజక వర్గంలో టూరిస్టులా పర్యటించి రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ఇదే రీతిలో వ్యవహరిస్తే సరియైన రీతిలో గుణపాఠం నేర్పుతామని వెల్లడించారు.

## పద్యకవికి జాతీయ కీర్తిరత్న, శ్రీ గౌతమేశ్వర పురస్కారాలు



కీర్తిరత్న, శ్రీ గౌతమేశ్వర పురస్కారం అందుకుంటున్న డా. బి. వెంకట్

ముథోల్, మే 18 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్‌కు చెందిన సంస్కృత భాషా ప్రచార సమితి ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రముఖ పద్యకవి డా.బి.వెంకట్ జాతీయ కీర్తిరత్న, శ్రీ గౌతమేశ్వర విశిష్ట సాహితీ పురస్కారాలను మంథనిలో అందుకున్నట్లు తెలిపారు. పెద్దపల్లి జిల్లా, మంథనిలోని జానకీ రామకళ్యాణ మందిరంలో శ్రీ ఆర్యాణి సకల కళావేదిక, అంతర్జాతీయ ధృవీకరణ పొందిన శ్రీ గౌతరమేశ్వర సాహితీ కళా సేవా సంస్థ 5వ వార్షికోత్సవాల సందర్భంగా శ్రీ గౌతరమేశ్వర సాహితీ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డా.దూడపాక శ్రీధర్, భవాని సాహిత్య సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డా.వైరాగ్యం ప్రభాకర్, ప్రముఖ కవులు పొర్ల వేణుగోపాల్ రావు, శ్రీధరాచార్యుల చేతుల మీదుగా వెంకట్ జాతీయ కీర్తిరత్న పురస్కారంతో పాటు శ్రీ గౌతమేశ్వర విశిష్ట సాహితీ పురస్కారాన్ని అందుకున్నారు. వెంకట్ చేస్తున్న ఆధ్యాత్మిక, సాహిత్య, సాంస్కృతిక, సామాజిక విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాలను అందజేశారు. 1994 నుంచి 5 వేలకు పైగా సభా కార్యక్రమాలను నిర్వహించినందుకు గాను తెలుగు, సంస్కృతం భాషలపై 18 లక్షల మంది బాలబాలికలకు ఉచిత శిక్షణ ఇచ్చినందుకు గుర్తింపుగా ఈ పురస్కారాలను అందజేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి 50 మందికి పైగా కవులు, కవయిత్రులు, తదితరులు పాల్గొన్నారు.

## వెండి ఆభరణాల చోరీ

నర్సాపూర్(జి), మే 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సావిత్రి అనే మహిళ ప్రతి రోజు లాగా శనివారం రాత్రి 9 గంటల సమయంలో ఇంటి తలుపులకు తాళం వేసి ఇంటి బయట పడుకుంది. ఆదివారం ఉదయం నిద్రలేచి చూడగా తాళం తీసి తలుపులు తెరిచి ఉన్నాయి. దీంతో అనుమానంతో ఇంటి లోపలికి వెళ్లి చూడగా ఇంటి లోపల గల బీరువా తలుపులు పగిలిఉన్నాయి. అందులో ఉన్న ఐదుతులాల వెండి పట్టగొలుసులను ఎవరో రాత్రి దొంగలించి పారిపోయారని సావిత్రి ఆదివారం పోలీస్‌స్టేషన్ నర్సాపూర్(జి)లో ఫిర్యాదు చేసింది. ఏఎస్సై శంకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# పట్టుబడుతున్న పశువులను ఉంచేది ఎక్కడ?

**● పోలీస్ అధికారులకు తలనొప్పిగా మారిన వ్యవహారం**

బోథ్, మే 18(ఆంధ్రజ్యోతి): పశువుల అక్రమ రవాణా మాఫియా జోరుగా తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. అధికారులు పటిష్ఠమైన ఇన్ఫార్మర్ వ్యవస్థను ఏర్పాటు చేసుకొని కొన్ని వాహనాలను పట్టుకుంటుంటే.. అందులో దొరికిన పశువులను ఎక్కడ ఉంచాలనేది అధికారులకు తలనొప్పిగా మారింది.

**● గోశాల నిర్వాహకులకు భారం**

అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన పశువులను పోలీసు అధికారులు స్థానికంగా ఉన్న గోశాలలకు తరలిస్తున్నారు. అయితే గోశాలను నిర్వహించే వారికి పశువులకు ఆహారం, నీరు పెట్టడం తలకు మించిన భారంగా మారింది. ఒకేసారి వందల సంఖ్యలో గోవులను తీసుకువచ్చి పోలీస్ అధికారులు గోశాలలో విడిచిపెడితే.. వాటిని కాపాడడం తలకు మించిన భారంగా మారుతుంది. ఓవైపు మండుతున్న ఎండలకు తోడు పశువులకు మంచినీటి వసతి కల్పించ లేకపోతున్నామని వాపోతున్నారు. అంతేగాక గోశాలలో పనిచేసే వారు దొరకకపోవడంతో ఇబ్బందిగా మారిందని కోరుకుంటున్నారు. పశుగ్రాసం అందుబాటులో ఉన్న ఇక్కడికి తీసుకురావడం వరంగా మారిందని అంటున్నారు.

**● ఎస్పీ చొరవతో అధికారుల్లో చలనం**

జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ గోవుల తరలింపుపై పటిష్ఠమైన నిఘా ఏర్పాటు చేయడంతో పాటు చెక్ పోస్టుల వద్ద పోలీసు అధికారులతో పాటు పశు వైద్య అధికారులను ఉంచడంతో పకడ్బందీగా తనిఖీలు కొనసాగుతున్నాయి. గతంలో ప్రతీరోజు గోవులను తరలిస్తున్నా.. పట్టించుకునే నాథుడు లేకపోవడంతో మూగ జీవాలు గోవధ శాలలకు తరలి వెళ్లేది. అయితే జిల్లా ఎస్పీ చొరవతో పశు వధశాలలకు వెళ్లే గోవులను పట్టుకుంటున్నారు. దీంతో మృత్యు భూపాలకు వెళ్లే గోవులు చెక్‌పోస్టుల వద్ద పట్టుబడుతున్నాయి. ఏది ఏమైనా గోవుల అక్రమ రవాణా చేసే వారు బెంబేలెత్తిపోతున్నారు.

**● గత తప్పిదాలను తవ్వుతున్న జిల్లా ఎస్పీ**

గతంలో పశువుల అక్రమ రవాణా ఏ విధంగా సాగింది? అందుకు కారణాలేమిటి? పోలీసు అధికారుల పాత్ర ఏ విధంగా ఉంది? అనే విషయాన్ని జిల్లా ఎస్పీ పరిశీలిస్తున్నట్టు సమాచారం. అంతేకాకుండా గతంలో పశువులు తరలిపోయిన ఎందుకు పట్టుకోలేక పోయారు అనే విషయాన్ని ప్రత్యేక అధికారుల ద్వారా రిపోర్టు చెప్పించుకున్నట్లు తెలిసింది. అప్పట్లో పశువుల అక్రమ రవాణా దారుల నుంచి ఎవరెవరు మిలాఖత్ అయ్యారనే విషయాన్ని ఎస్పీ పరిశీలిస్తున్నట్లు సమాచారం. వాస్తవాలు బయటకు వస్తే పశువుల అక్రమ రవాణా దారులతో చేతులు కలిపిన బాధిత పోలీస్ అధికారులపై చర్యలు తీసుకునే ఆస్కారం ఉందంటున్నారు.



బోథ్ మండలంలోని ఘనపూర్ చెక్‌పోస్ట్ వద్ద పశువులను రవాణా చేస్తూ పట్టుబడిన లారీ



ఇచ్చోడలోని గోశాలలో అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన పశువులు



ఉట్నూర్ రైతు వేదికలో చెడిపోయిన సీలింగ్ ఫ్యాన్



రైతు వేదికల్లో మూలకు ఉన్న పరికరాలు

## రైతు వేదికలు నిర్మించారు.. నిర్వహణ మరిచారు!

(3వ పేజీ తరువాయి...)

అధికారులకు ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు.

**హడావుడిగా ప్రారంభోత్సవాలు..**

జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి క్లస్టర్ల వారీగా నిర్మించిన రైతు వేదికలకు మరుగుదొడ్ల నిర్మాణం పూర్తికాకుండానే ప్రారంభోత్సవాలు చేయడంతో పాటు క్లస్టర్లకు మంచినీటి సౌకర్యం కూడా లేకపోవడంతో మహిళా సిబ్బందితో పాటు, మహిళా రైతులు కూడా కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఆర్భాటంగా నిర్మాణాలు పూర్తి చేసిన కాంట్రాక్టర్లు ఇంకా బిల్లులు రాకపోవడంతో కొన్ని కొన్ని పనులు పూర్తి చేయక పోవడంతో సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు.

**పోకిరీలకు అడ్డాలుగా..**

గ్రామాలకు దూరంగా రైతు వేదికలు నిర్మించడంతో వీటికి రక్షణ కరువైంది. ప్రతీ వేదికకు ప్రహరీ గోడలు లేకపోవడంతో ఆయా గ్రామాలకు చెందిన పోకిరీలు రైతు వేదికల ప్రాంతాల్లో జల్సాలకు పూనుకుంటున్నారు. ప్రభుత్వం వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించడానికి రూ.5 లక్షల వంతున కేటాయిస్తూ ఒక్కో మండలానికి ఒక రైతు వేదికకు ప్రయోగాత్మకంగా వీసీ పరికరాలు కేటాయిస్తుంది. ఇదేకాకుండా ఇప్పటికే ప్రతీ రైతు వేదికకు 125 కూర్చీలు, రెండు బల్లాలు, ఎస్‌మోడల్ కూర్చీలు, రెండు వీల్‌చైర్లు, ఒక్కొక్క మైక్ సెట్ కూడా కేటాయించారు. దీంతో తలుపులు బాగా లేక, ఊరికి దూరంగా ఉన్న రైతు వేదికలకు భద్రత కరువైందని ప్రభుత్వం వాచ్‌మెన్‌లతో పాటు ప్రహరి గోడలు, పారిశుధ్య సిబ్బందిని నియమించాలని జిల్లాలోని రైతులు కోరుకుంటున్నారు.



క్యూలో నిలుచున్న భక్తులు

## భక్తులతో కిటకిటలాడిన అడెల్లి ఆలయం

సారంగాపూర్, మే 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని అడెల్లి మహాపోచమ్మ దేవాలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాల నుంచి కాకుండి అధికసంఖ్యలో సంఖ్యలో భక్తులు హాజరై ఆలయంలో మొక్కులను మొక్కి అమ్మవారికి పెరుగన్నంను నైవేద్యంగా సమర్పించారు. అమ్మవారికి మొక్కులు తీర్చుకోవడానికి వచ్చిన భక్తులు ఎలాంటి ఇబ్బంది ఎదుర్కోకుండా ఉండడడానికి ఆలయ ఇన్‌చార్జి ఈవో రమేష్ అన్ని చర్యలు తీసుకున్నారు. మొక్కులు తీర్చుకోవడానికి వచ్చిన భక్తులు ఆలయం వద్ద సాయంత్రం ఈదురుగాలులు వీయడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

## బీజేపీ మండల కమిటీ ఎన్నిక

కుంటాల, మే 18(ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముథోల్ ఎమ్మెల్యే రామరావు పటేల్, జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ ఆదేశాల మేరకు కమిటీని ఏర్పాటు చేసినట్లు మండల బాధ్యులు పసుల నవీన్ తెలిపారు. ఉపాధ్యక్షులుగా రవి (లింబా (బీ), సుధాకర్ (అంబకంటి), షేక్ గౌస్ (దౌనెల్లి), రాథోడ్ మోహన్ (అంబుగాం), ప్రధాన కార్యదర్శులుగా సూర్యవంశీ సాయినాథ్ (పెంచికల్‌పాడ్), బోగ గోవర్ధన్ (కుంటాల), కార్యదర్శులుగా ఎర్రోజు ప్రశాంత్ (అందకూర్), పడకంటి సాయినాథ్ (విట్టాపూర్), జాదవ్ అఖిల్ పటేల్ (మెదన్‌పూర్), దర్శనం పోశెట్టి (ఓల), ట్రెజరర్‌గా సుద్దం మహేంధర్ (కుంటాల)లను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసి బీజేపీ గెలుపు కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## కాంగ్రెస్ కార్యకర్తకు పరామర్శ

దిలావర్‌పూర్, మే 18(ఆంధ్రజ్యోతి): గత కొంత కాలంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న మండలంలోని న్యూ లోలం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు రతన్ తండ్రిని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరి రావు ఆదివారం పరామర్శించారు. కొంత కాలం పాటు నిజామాబాద్‌లో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది ప్రస్తుతం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కొట్టే శేఖర్, శ్రీహరి, గాజుల రవి కుమార్, తదితరులున్నారు.

## భక్తులతో కిటకిటలాడిన ఎల్లమ్మ ఆలయం

**● దిలావర్‌పూర్‌కు తరలివచ్చిన భక్తజనం**

దిలావర్‌పూర్, మే 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం శివారులో వెలసిన ప్రసిద్ధమైన పురాతన ఎల్లమ్మ క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిలడింది. ప్రతి ఆది, మంగళ, గురువారాల్లో భక్తులు ఎల్లమ్మకు మొక్కులు చెల్లించుకునేందుకు వస్తారు. ఆదివారం భక్తుల రాక అధికంగా ఉంటుంది. అమ్మవారి పుష్కరిణిలో పవిత్ర స్నానాలు చేసి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. ఇక్కడే వంటకాలు చేసి అమ్మవారికి పెరుగన్నం నైవేద్యంగా సమర్పిస్తారు. భారీగా భక్తుల రాకతో ఆలయ పరిసరాల్లో ఉన్న చెట్లు సరిపోలేదు. ఎండ కారణంగా చెట్ల కింద వంటలు చేసుకునేందుకు భక్తులు తంటాలు పడ్డారు. సమీపంలో ఉన్న పంట చేలల్లో ఉన్నచెట్ల కింద వంట చేసుకున్నారు. వచ్చిన భక్తులు త్రాగునీటికి ఇబ్బంది పడకుండా స్థానిక వీడీసీ సభ్యులు చర్యలు తీసుకున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా కోనేరు వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు.



ఎల్లమ్మ తల్లికి నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు

## వాగులో దూకి వ్యక్తి ఆత్మహత్య

నిర్మల్ రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): సిద్దాపూర్ సమీపంలో గల స్వర్ణ వాగులో లెవెల్ వంతెన వద్ద ఆదివారం మృతదేహం లభ్యమైందని పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని ఆదర్శనగర్‌కు చెందిన ఎల్లయ్య(55) మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం : ఎస్సై

లక్ష్మణచాంద, మే 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిరుపెల్లి గ్రామ శివారులో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై సుప్రియ ఆదివారం తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటన స్థలాన్ని పరిశీలించగా గ్రామ శివారులోని కెనాల్ వద్ద సుమారు 30 నుంచి 35 సంవత్సరాలు వయస్సు కలిగిన పురుషుడి మృతదేహంను గుర్తించారు. ఒంటిపైన పసుపు రంగు, నలుపు రంగు లైన్ గల టీ షర్ట్, యాష్ కలర్ ప్యాంటు ఉన్నట్లు తెలిపారు. మృతుడి ముఖం, ఇతర భాగాలు పూర్తిగా కుళ్లిపోయి గుర్తుపట్టలేని స్థితిలో ఉందని వెల్లడించారు. తిరుపెల్లి గ్రామ పంచా యతీ సెక్రటరీ జోషి శ్రీవేణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ట్లు తెలిపారు.



తిరుపెల్లి శివారులో శవాన్ని పరిశీలిస్తున్న ఎస్సై సుప్రియ

## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**● ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్**

ఆదిలాబాద్ టౌన్, మే 18(ఆంధ్రజ్యోతి): ప్రజలు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదివారం తెలిపారు. గంజాయి అమ్మడం, పండించటం చట్ట రీత్యా నేరమన్నారు. గ్రామ అభివృద్ధి పేరుతో అక్రమ వసూళ్లు చేయరాదన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మైనర్‌లు వాహనాలు నడపవద్దని సూచించారు. సంబంధిత అంశాలను ప్రజలు గమనించి పోలీసులకు సహకరించాలని కోరారు.

## భైంసాలోని వివేకానంద అవాసానికి ప్రైవేట్ అధ్యాపకుడి చేయూత

భైంసా, మే 18 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలోని శ్రీ వివేకానంద అవాస కేంద్రానికి కుంటాల మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామానికి చెందిన ప్రైవేట్ అధ్యాపకుడు అవదూత్‌వార్ రాములు చేయూతనందించాడు. ఆదివారం అవాసాన్ని సందర్శించిన ఆయన అవాసంలోని విద్యార్థి ఒకరి పాఠశాల వార్షిక ఫీజు రూ.15 వేలను విరాళంగా అందించారు. అంతేకాకుండా గత ఎడాది కాలంగా తాను టీ తాగడం మానివేసి అందుకు రోజుకు అయ్యే రూ.10 వ్యయాన్ని కూడబెట్టి సంబంధిత డబ్బులు రూ.3,650 సైతం అవాస నిర్వాహణ కోసం గాను విరాళంగా అందించాడు. ఇందులో అవాస నిర్వాహక కమిటీ ప్రతినిధులు శైలేష్ మహాశెట్టివార్, సాధుల కృష్ణదాస్, రంగు రవి, నాగమణి లింగన్న, లింగారెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ సోయం బాపురావు

## కాంట్రాక్టర్ మృతికి రాజకీయ నేతలే కారణం

**● మాజీ ఎంపీ సోయం బాపురావు**

ఆదిలాబాద్, మే 18(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ సివిల్ కాంట్రాక్టర్ గుట్ట ప్రవీణ్ మృతికి రాజకీయ నేతలే కారణమని మాజీ ఎంపీ సోయం బాపురావు ఆరోపించారు. ఆదివారం ఓల్డ్ హౌజింగ్ బోర్డు కాలనీలో నిర్వహించిన సంతాప సమావేశానికి హాజరై ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ప్రవీణ్ మృతి జిల్లాకు తీరని లోటని అన్నారు. అభివృద్ధి పనుల విషయంలో కొంత మంది అధికారంలో ఉన్న నేతలు అడ్డగోలుగా వ్యవహరించడంతో ప్రవీణ్ తీవ్ర మనస్థాపానికి గురయ్యారని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నంత మాత్రాన కాంట్రాక్టర్లను వేదింపులు, భయ భ్రాంతులకు గురి చేయవద్దని సూచించారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రవీణ్‌కుటుంబానికి న్యాయంచేస్తామ న్నారు. కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని తెలపారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్ నేతలు, తదితరులు ఐన్నారు.

**● ప్రవీణ్ మరణం తీరని లోటు : జోగు రామన్న**

**ఆదిలాబాద్ అర్బన్:** పట్టణానికి చెందిన ప్రముఖ సివిల్ కాంట్రాక్టర్ గుట్ట ప్రవీణ్ మృతిపట్ల సంతాపం వ్యక్తం చేస్తూ శ్రద్ధాంజలి కార్యక్రమంలో మాజీ మంత్రి జోగు రామన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలను సమర్పించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం కుటుంబ సభ్యులను కలసి ఓదార్చారు. గుట్ట ప్రవీణ్‌తో ఉన్న స్నేహపూర్వక సంబంధాన్ని జోగు రామన్న గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో యాసం నర్సింగ రావు, దాసరి రమేష్, బట్టుసతీష్, కుమ్రరాజు, సంతోష్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీపూర్ చెక్‌పోస్టు వద పట్టుబడ్డ జొన్నల లారీ

## మహారాష్ట్ర జొన్నల పట్టివేత

తలమడుగు, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపూర్ చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆదివారం మహారాష్ట్ర జొన్నలు పట్టుబడ్డాయి. ఏఈవో వెంకటేష్, ఎస్ఐ రాధిక ఆధ్వర్యంలో లక్ష్మీపూర్ చెక్ పోస్టు వద్ద వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా.. మహారాష్ట్ర నుంచి (ఎంహెచ్18 బీహెచ్ 1236) నెంబర్ గల లారీ రాగా.. దానిని ఆపి పరిశీలించారు. కాగా లారీలో మహారాష్ట్ర జొన్నలు 30 టన్నులు ఉన్నట్లు తెలిసింది. దీంతో లీరీ డ్రైవర్‌ను విచారించగా.. ఆయన పేరు బోయ రాజేష్ పింపుల్ అని, నేరగా గ్రామం, దూలే జిల్లా అని తెలిపాడు. ఇతను ఆదిలాబాద్‌కు జొన్నలను తరలిస్తున్నట్లు చెప్పగా ఏఈవో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

జైనథ్, మే18 (ఆంధ్రజ్యోతి): మండలంలో కరంజి గ్రామానికి చెందిన ఎల్టి విజయలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర మాజీ మంత్రి జోగు రామన్న ఆదివారం జైనథ్ మండలంలోని కరంజి గ్రామానికి చేరుకుని మృతుని కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ ధైర్యాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిల్కూరి లక్ష్మారెడ్డి, నాయకులు బట్టుసతీస్, కుమ్రరాజు, కొప్పుల బాపురెడ్డిలతో పాటు కరంజి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అద్దె భవనంలో డీఆర్ డిపో భవనం

**● తలమడుగులో సొంత స్థలం ఉన్నా.. కొత్త భవనానికి నోచుకోని వైనం ● రేషన్ వినియోగదారులకు తప్పని ఇబ్బందులు ● పట్టించుకోని ఐటీడీఏ అధికారులు**

తలమడుగు, మే 18(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజలకు నిత్యావసర సరుకులు అందించేందుకు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన డీఆర్ డిపోకు సొంత భవనం లేక అద్దె భవనం కొనసాగడంతో నిత్యావసర వినియోగదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. మండల కేంద్రంలో డీర్ డిపోకు సొంత స్థలం ఉన్నా.. అధికారులు మాత్రం నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండల కేంద్రంలో నూతన భవన నిర్మించాలని గతంలో మాజీ జడ్పీటీసీ గణేష్ రెడ్డి, తలమడుగు మాజీ సర్పంచ్ కరుణాకర్ రెడ్డిలు సంబంధిత ఐటిడిఏ అధికారులకు విన్నవించారు. అయినా ఇప్పటి వరకు భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయలేదు. దీంతో డీఆర్ డిపో అద్దె భవనం కొనసాగడంతో వినియోదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రేషన్ కోసం వచ్చిన వినియోదారులు ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ గంటల తరబడి బియ్యం కోసం ఎదురుచూస్తున్నారు. అంతేకాకుండా అద్దె భవనంలో కనీస మౌలిక వసతులు లేకపోవడంతో వర్షానికి బియ్యం తడిసి ముద్ద అవుతున్నాయని డీఆర్ డిపో సేల్స్‌మెన్ వామన్ తెలిపారు. మండల కేంద్రంలో దాదాపు మండల కేంద్రంలో దాదాపు 1500 వరకు రేషన్ కార్డుల. లబ్ధిదారులు ఉన్నారు. కాగా. సొంత భవనం లేకపోవడంతో డియర్ డిపోలో కేవలం బియ్యం మాత్రమే. విక్రయిస్తున్నారు. సొంత భవనం ఉంటే బియ్యంతో పాటు తొమ్మిది రకాల నిత్యవసర వస్తువులను డియర్ డిపో ద్వారా వినియోదారులకు తక్కువ ధరకే విక్రయించే అవకాశం లభిస్తుంది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి మండల కేంద్రంలో డియర్ డిపో భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని పలువురు గ్రామస్థులు కోరుతున్నారు.

**● సొంత భవనం నిర్మించాలి**

**: నేతుల గంగన్న, వినియోగదారుడు, తలమడుగు**



మండల కేంద్రంలో డీఆర్ డిపో సొంత భవనం లేకపోవడంతో వినియోదారులకు ఇబ్బం దుల అవుతున్నాయి. అధికారులు స్పందించి సొంత భవనం నిర్మించి తొమ్మిది రకాల నిత్యా వసర వస్తువులను వినియోదారులకు అందే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలి.



అద్దె భవనాల్లో కొనసాగుతున్న డీఆర్ డిపోలో బియ్యం కోసం ఎదురు చూస్తున్న వినియోగదారులు



తలమడుగు మండల కేంద్రంలో డీఆర్ డిపోకు సంబంధించిన ఖాళీ స్థలం



బోథ్‌లో పొలం బాట ఆక్రమణకు గురైందంటూ ఆందోళన చేస్తున్న రైతులు

## వివాదాలకు కారణమవుతున్న
# పొలం బాటలు

బోథ్, మే 18 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం సమీపిస్తుడడంతో రైతులు పొలం పనులు వేగవంతం చేస్తున్నారు. వేసవి దిక్కులు పూర్తిచేసి భూములను పంట సాగుకు సిద్ధం చేస్తున్నారు. వర్షాలు కురిస్తే తక్షణమే విత్తనాలు నాటేందుకు సిద్ధమవుతున్నారు. అయితే వారి వారి పొలాలకు వెళ్లేందుకు రైతులు సిద్ధమవుతుండగా కొంతమంది రైతులు పొలం దారులను ఆక్రమించుకుంటున్నాడంతో ఎడ్ల బండ్లు వెళ్లేందుకు ఇబ్బందికరంగా మారుతున్నది.

**● ప్రతీ యేటా ఇదే తంతు**

ఎడ్లబండ్ల దారులు ఆక్రమించుకొని కొంతమంది రైతులు దున్నిస్తుండడంతో దారులు ఏటా ఏటా చిన్నవిగా అవుతున్నాయి. దీంతో రైతులు తమ పొలాలకు ఎడ్ల మండల పై వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. ప్రతి సంవత్సరం ఇటువంటి ఇబ్బందులు తలెత్తుతుండడంతో రైతులు రెవెన్యూ పోలీసు అధికారులను ఆశ్రయిస్తూ వస్తున్నారు. అయితే కొన్ని గ్రామాల్లో ఎడ్ల బండ్ల రహదారుల విషయమై రైతుల్లో కొట్లాటలకు దారి తీస్తున్నది.

**● అధికారుల నిఘా అవసరం**

ఒకప్పుడు రెండు ఎడ్ల బండ్లు ఎదురెదురుగా వస్తే ప్రశాంతంగా రైతులు వెళ్లిపోయేవారు. అయితే క్రమక్రమంగా ఎడ్ల బండ్ల దారులకు ఇరు వైపులా ఉన్న రైతులు రహదారులను ఆక్రమించుకొని పెన్సింగ్ వేస్తుండడంతో దారులు ఇరుకుగా మారిపోతున్నాయి. దీంతో రైతులు ఎడ్ల బండ్ల బాట కోసం కొట్లా టలకు దిగుతున్నారు. ఒకప్పుడు వివిధ గ్రామా లను కలుపుతూ ఎడ్లబండ్ల రహదారులు 30 ఫీట్ల వెడల్పుతో ఉండేవి. అయితే ఆ దారులన్నీ రైతులు ఆక్రమణలు చేయడంతో కనుమరుగై పో తున్నాయి. బోథ్ నుంచి అడెల్లి వరకు వెళ్లే రోడ్డు ఆక్రమణకు గురికాగా బోత్ కను గుట్ట కౌటా గ్రామస్థులు వినియోగించే ఎడ్లబండ్ల బాట మూసుకుపోయింది. ఇక రైతులకు లింకు రోడ్ అయిన కౌట పొచ్చెరా మీదుగా వడ్డూర్ వరకు ఉన్న రోడ్డు నామరూపాలు లేకుండా పోయింది. అంతేగాక కౌటా నుంచి బజార్హత్నూర్ మండలానికి బం డ రేవు పల్లె మీదుగా వెళ్లేది. అయితే ఈ రోడ్డు ఆక్రమణలకు గురికావడంతో రోడ్డు కనుమరుగయింది.

**● రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలి**

ఒకప్పుడు రైతులు పండించిన పంటను తీసుకువెళ్లేందుకు గ్రామాలను కలుపుకుంటూ ఎడ్లబండ్ల బాటలు ఉండేవి. అయితే క్రమక్రమంగా ఎడ్లబండ్లు కనుమరుగు అవుతుండడంతో ట్రాక్టర్లు వ్యవసాయ రంగంలోకి రంగ ప్రవేశం చేశాయి. దీంతో ఎడ్ల పనులు తగ్గడంతో కొంతమంది రైతులు పొలం బాటలను కబ్జా చేశారు. కబ్జాకు గురైన పొలం బాటలను యథావిధిగా ఉంచేందుకు రెవెన్యూ రికార్డుల ప్రకారం కబ్జాదారుల నుంచి భూమిని విడిపించి రోడ్లను అభివృద్ధి చేయాల్సిన అవ సరం ఉంది.

**● ప్రభుత్వ యంత్రాంగం సీరియస్**

కబ్జాలకు గురైన బండ్ల బాటలను రైతుల నుంచి విడిపించేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. అయితే జిల్లా కలెక్టర్ ఈ విషయంలో తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం. క్రింది స్థాయిలో ఉన్న రెవెన్యూ అధికారులు పొలం బాటలను గతంలో ఉన్న విధంగానే పొలం బాటలను ఉంచాలని రైతులు కోరు తున్నారు.



అర్‌డీవో కార్యాలయం ఎదుట ఫౌంటైన్‌లా విరజిమ్ముతూ వృథాగా పోతున్న నీరు



బోయిగల్లిలో నల్లాకు బిరడా లేక వృథాగా పోతున్న నీరు



గణేష్‌నగర్ కాలనీలో మిని ట్యాంక్ నిండిపోయి వృథాగా పోతున్న నీరు



భట్టిగల్లిలో నల్లాల ద్వారా వృథాగా మురుగు కాలువ పాలవుతున్న నీరు

# వృథాగా పోతున్న నీరు.. పట్టించుకునే వారు లేరు!

**● బిరడా లేని నల్లాలు ● ఆగని బోరుబావులు**
**● మినీ ట్యాంక్‌లు నిండిపోయి పొర్లిపోతున్న నీరు**

భైంసా, మే 18 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో ఎక్కడ చూసిన బోరు బావుల్లో నీటి నిల్వలు తగ్గిపోతున్నాయి. ప్రతికూల పరిస్థితుల కారణంగా భూగర్భ జలాలు అడుగంటిపోతుండటంతో అన్ని ప్రాంతాల్లోనూ నీటి సమస్యలు పెరిగి పోతున్నాయి. నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న ప్రాంతాల వాసులు నీరు కోసం నిత్యం అగచాట్ల పాలవుతున్నారు. దినం, రాత్రి అనే తేడా లేకుండా నీటి కోసం తంటాలు పడుతున్నారు. ఇదిలా ఉంటే నీరు సమృద్ధిగానున్న ప్రాంతాల్లో ఎంతో విలువైన నీరు వృథాగా పోతోంది. ఇందుకు ఉదాహరణగా భైంసా మున్సిపల్ కేంద్రంలోని పలు ప్రాంతాలను పేర్కొనవచ్చు. మున్సిపల్ అధికార వర్గం అనుసరిస్తున్న అలసత్వ విధానాలు, బాధ్యతారాహిత్య వైఖరులతో నిర్వాహణ సిబ్బంది నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తుండటం మూలంగా ఎంతో విలువైన నీరు వృథాగా పోతోంది.

**● నల్లాల వద్ద నీరు అధికం**

పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లోనున్న నల్లాల ద్వారా నీరు అధికంగా వృథా అవుతోంది. సంబంధిత నల్లాలకు బిరడా లేకపోవడం మూలంగా నీటి సరఫరా కొనసాగుతున్న సమయంలో నీరు వృథాగానే పోతోంది. నల్లాల వద్ద ఆయా ప్రాంతాలవాసులు నీటిని పట్టుకోవడం ముగిసిన అనంతరం బిరడా లేకపోవడం మూలంగా వాటి ద్వారా వృథాగానే నీరు పోతోంది.

**● మినీ ట్యాంక్‌లు నిండి పొర్లిపోతున్న నీరు**

పట్టణ పరిధిలోని పలు కాలనీల్లో ఏర్పాటు చేసిన మినీ ట్యాంకులు నిండి నీరు పొర్లిపోతోంది. విద్యుత్ సరఫరా కొనసాగిన సమయంలో మిని ట్యాంక్‌ల కోసం ఏర్పాటు చేసిన బోరుబావుల పంపు మోటారు నిరంతరాయంగా పనిచేస్తుంటుంది. ఈ క్రమంలో ట్యాంక్‌లు నిండిపోయిన అనంతరం పంపు మోటారును అపివేసే వారు కరువయ్యారు. ఈ క్రమంలో మినీ ట్యాంక్‌లు నిండి పొర్లిపోయి నీరు వృథాగా పోతోంది.

**● పర్యవేక్షణ లోపంతోనే..**

నిర్వాహణ వ్యవస్థను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాల్సిన మున్సిపల్ అధికార వర్గం కార్యాలయానికి, సమావేశాలకు మాత్రమే పరిమితమవుతున్నారు. వారి పర్యవేక్షణ లోపాన్ని అసరగా తీసుకుంటున్న నీటి సరఫరా విభాగపు సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా ఎంతో విలువైన నీరు వృథాగా పోతోంది. నీటి ఎద్దడి గల ప్రాంతాలవాసులు వ్యథల భారిన పడుతుండగా నీరు సమృద్ధిగానున్న ప్రాంతాల్లో వృదాగా పోతోంది. నీటి వృథాను అరికట్టకపోతే రానున్న రోజుల్లో సమృద్ధిగానున్న ప్రాంతాల్లో సైతం నీటి ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితులు నెలకొంటున్నాయి. మున్సిపల్ అధికార వర్గం ఇకనైనా క్షేత్ర స్థాయిలో పర్యటించి నీటి వృథాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవకశ్యకత ఎంతైనా ఉంది.



చెట్ల కింద లారీలను ఆపుకుని సేద దీరుతున్న డ్రైవర్లు



రోడ్డు పక్కన పసుపు ఆరబోసినట్లు కనిపిస్తున్న పూలు



రోడ్డుపై పచ్చని గొడుగేసినట్లు కనిపిస్తున్న చెట్లు

# ఆహ్లాదం.. ఆనందం

దిలావర్‌పూర్, మే 18 (ఆంధ్రజ్యోతి) : ఎంత ఎండ వేడి ఉన్న సరే... అక్కడికి రాగానే కాస్త ఊరట దొరుకుతుంది. ఎంత అలసటగా ఉన్న సరే ఉపశమనం లభిస్తుంది. ఆహ్లాదం... ఆనందం కలగలిపి ప్రయాణికులకు కాస్త విశ్రాంతి తీసుకునేందుకు మనసు ఉవ్విలూరుతుంది. పచ్చ'ధనం'తో ప్రయాణికులను ఇట్టే ఆకట్టుకుంటున్న ఈ చెట్లు దిలావర్‌పూర్ మండలంలోని జాతీయ రహదారిపై సిర్గాపూర్ వద్ద ఉన్నాయి. అప్పట్లో నందమూరి తారక రామారావు సీఎంగా ఉన్న సమయంలో 61వ జాతీయ రహదారి పక్కన నాటించిన మొక్కలు పెరిగి పెద్దవై నీడనిస్తున్నాయి. జాతీయ రహదారిపై ఒక అర కిలోమీటర్ మేర అచ్చంగా పచ్చని గొడుగేసినట్లు కనిపించే ఈ చెట్లు రోజూ ఎంతో మంది డ్రైవర్లకు, ప్రయాణికులకు అలసట తీరుస్తున్నాయి. కాస్త విశ్రాంతి తీసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నాయి. చెట్ల పైనుంచి రాలిని పూలు భువిపై పసుపార బోసినట్లు కనిపిస్తూ ఆహ్లాదం పంచుతున్నాయి. ఈ జాతీయ రహదారిపై దూర ప్రాంతాలకు ప్రయాణించే లారీ డ్రైవర్‌లైతే ఇక్కడ ఆగి భోజనం చేసి కాస్త కునుకు తీయకుండా వెళ్లరంటే నమ్మండి.

# ఉద్యాన పంటల సాగు.. బహు బాగు

**● కూరగాయలు, పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం ● ప్రణాళిక సిద్ధం చేసిన ఉద్యాన శాఖ**



తీగ జాతి కూరగాయల సాగు కోసం పందిరి వేస్తున్న దృశ్యం



పామ్ ఆయిల్ పంటలో అంతర పంటగా బొప్పాయి సాగు

దిలావర్‌పూర్, మే 18 (ఆంధ్రజ్యోతి) : కూరగాయలు సాగు, పండ్ల తోటలు, ఆయిల్ పామ్ సాగును, పూల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొం దించింది. 2025-26 కోసం ఉద్యాన శాఖ సమగ్ర ప్రణాళిక రూపొందించింది. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, నేషనల్ మిషన్ ఆఫ్ ఎడీబుల్ ఆయిల్స్, జాతీయ వెదురు మిషన్ సమీకృత అభివృద్ధి మిషన్ తదితర సంస్థల నిధులతో జిల్లాలో పండ్ల తోటల సాగుకు రైతులను ప్రోత్సహించేం దుకు అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రాయితీలు, పరికరాలకు సబ్సిడీ ఇచ్చి రైతులపై ఆర్థిక భారం తగ్గించే ఉద్యాన రంగంలో ఉత్పాదకతను పెంచడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.

**కూరగాయల సాగుకు..**

రాష్ట్రీ కృషి వికాస్ యోజన పథకం కింద కాకర, బీర, సొరకాయ, దొండ వంటి తీగ జాతి కూరగాయల సాగుకు శాశ్వతం పందిళ్ల నిర్మాణానికి 50 శాతం రాయితీ ఇవ్వనున్నారు. అంటే ఎకరానికి సుమారు రూ. లక్ష రాయితీ లభిస్తుంది. తుంపర, బిందు సేద్యం పరికరాలకు ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం సన్నకారు రైతులకు తొంభై శాతం, 5 ఎకరాలకు పైగా ఉన్న రైతులకు ఎనభై శాతం రాయితీ ఇవ్వనున్నారు.

**పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం**

సమీకృత అభివృద్ధి మిషన్ పథకం ద్వారా జామ, నిమ్మ, బత్తాయి, సీతాఫలం, మామిడి తోటల సాగుకు మూడేళ్ల లో రూ. 48 వేలు, డ్రాగన్ ఫ్రూట్, బొప్పాయి, అరటి సా గుకు ఎకరానికి రూ. 7,200లు రాయితీ, ప్లాస్టిక్ మల్చింగ్, నీటి కుంటలు, వర్మీ కంపోస్టు యూనిట్లకు 50 శాతం రా యితీ, 70 కేజీల సామర్థ్యం గల సోలార్ క్రాప్ డ్రైయర్‌కు రూ. 40 శాతం, ఎస్సీ, ఎస్టీ రైతులకు 55 శాతం రాయితీ ఇస్తారు.

**ఆయిల్ పామ్ సాగుకు రాయితీ**

ఆయిల్ పామ్ సాగుకు 90 శాతం రాయితీతో పాటు తోటల సంరక్షణ, అంతర పంటల సాగుకు నాలుగేళ్ల పాటు ఎకరానికి రూ. 4,200ల చొప్పున అందిస్తారు.

**పూల సాగుతోనూ ఆర్థిక లాభం**

ప్రస్తుతం మార్కెట్‌లో పూలకు మంచి డిమాండ్ ఉంది. అన్ని కాలాల్లోను పూలు అవసరమవుతాయి. ప్రభుత్వం పూల సాగు చేసే రైతులకు రాయితీ ఇస్తోంది. పూలను సాగు చేయడం ద్వారా లాభాలను ఆర్జించే అవకాశం లేక పోలేదు. పూల సాగును చేపట్టేందుకు ప్రభుత్వం 50 శాతం రాయితీ ఇస్తోంది. అధికారులు రాయితీ, ప్రోత్సాహక చర్యలు తీసుకుంటూ ఉద్యాన సాగువైపు దృష్టి సారించేం దుకు రైతులను చైతన్యం చేస్తున్నారు.

**ఉద్యాన పంటల సాగుకు రైతులు ముందుకు రావాలి**

**● సాదుల మౌనిక, నిర్మల్ డివిజన్ ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి**

ఉద్యాన పంటలు సాగుచేసే రైతులకు రాయితీ ఇస్తున్నాం. రైతులు ముందుకు రావాలి. ఈ ఏడాది ఉద్యాన సా గు పెంచేందుకు రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఆ యిల్ పామ్, పండ్ల తోటల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. విరివిగా రాయితీలు ఇస్తోంది. రైతులు సద్వి నియోగం చేసుకోవాలి.



ప్రభుత్వ రాయితీతో పూల సాగు చేస్తున్న రైతు



బొప్పాయి సాగు చేస్తున్న రైతు




ఆయిల్ పామ్ పంటను పరిశీలిస్తున్న అధికారులు

## రోడ్లపైనే చెట్లు.. రాకపోకలకు ఇక్కట్లు



నడి రోడ్డుపై పడి ఉన్న చెట్లు

తాంసి, మే 18 (ఆంధ్రజ్యోతి): నిన్న మొన్నటి వర్షాలకు నెలకొరిగిన చెట్లు, చెట్లకొమ్మలు రోడ్లపై పడి ప్రయాణికుల రాకపోకలకు ఆటంకంగా మారాయి. తాంసి నుండి అందర్ బంద్ మార్గంలో వామన్ నగర్ సమీపంలో రోడ్లపై చెట్లు నెలకొరగడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్న ఆరోపణలు సర్వత్ర వ్యక్తం అవుతున్నాయి. అసలే ఇరుకు రోడ్లు ఎదురదురుగా వాహనాలు వస్తేనే ఇబ్బందిగా ఉంటుంది. అలాంటిది రోడ్లపైనే చెట్లు పడి ఉండటంతో వాటిని తప్పించడంలో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నిత్యం చిన్న చిన్న ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్లపై పడి ఉన్న చెట్లను తొలగించడమే కాకుండా రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలను సైతం తొలగించాలని వాహన చోదకులు కోరుతున్నారు.



శ్యామ్‌పూర్‌లోని రైతువేదిక



ఉట్నూర్‌లోని రైతువేదిక



దంతంపల్లి రైతు వేదిక వద్ద చెడిపోయిన ఫ్లోరింగ్

# రైతు వేదికలు నిర్మించారు.. నిర్వహణ మరిచారు!

- జిల్లాలో వ్యవసాయ శాఖను రైతులకు అందుబాటులో ఉంచాలని క్లస్టర్ల వారీగా ఏర్పాటు
- నిధులు లేక నీరసిస్తున్న విస్తరణ అధికారులు
- పంటల సాగు కోసం రైతులకు సలహాలు, సూచనలు ఏవీ?
- మహిళా సిబ్బందికి, మహిళా రైతులకు తప్పని ఇక్కట్లు
- పలుచోట్ల రైతు వేదికలకు రక్షణ కరువు
- జిల్లావ్యాప్తంగా 2020లో రూ.20 కోట్ల 20 లక్షలతో 101 రైతు వేదికల నిర్మాణం

ఉట్నూర్, మే 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతాంగానికి అందుబాటులో వ్యవసాయ శాఖను ఉంచాలని భావించిన రాష్ట్ర ప్రభుత్వం క్లస్టర్ల వారీగా నిర్మించిన రైతు వేదికల నిర్వహణను ప్రభుత్వం మరిచి పోయింది. రైతులకు పంటల సాగు కోసం సలహాలు, సూచనలు ఇవ్వడానికి జిల్లాలోని ఒక వంద ఒకటి క్లస్టర్లలో రూ.20 కోట్ల 20 లక్షలతో రైతు వేదికలు 2020లో నిర్మించారు. ఆయా ప్రాంతాల ఎమ్మెల్యేల అనుచరులతో నిర్మించిన రైతు వేదికల భవనాల నిర్మాణం పూర్తి కాకుండానే ప్రభుత్వ ఆదేశాల మేరకు హడావిడిగా ప్రారంభోత్సవాలు నిర్వహించారు. క్లస్టర్ల పరిధిలో ఉన్న రైతుల వివరాలతో పాటు భూముల వివరాలను తెలుసుకుని రైతులకు ఎంతో సేవ అందించే వీలుగా నిర్మించిన రైతు వేదికలకు నిర్వహణ కోసం ప్రతీనెల ఒక్కొక్క రైతు వేదికకు రూ.9వేల వంతున 101 రైతు వేదికలకు ప్రతి నెల రూ.9.09 లక్షలు ప్రభుత్వం కేటాయించాలని భావించింది.



రైతు వేదికలకు కేటాయించిన కుర్చీలు

### నిర్వహణ నిధులు ఏమాయే?

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో రైతుల ప్రయోజనం కోసం నిర్మించిన రైతు వేదికల నిర్వహణ కోసం ప్రతినెల తొమ్మిది వేలు ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం 2021లో కేవలం ఐదు నెలల పాటు రూ.9 వేల వంతున మంజూరు చేసింది. ఈ నిధుల ద్వారా రైతు వేదికకు అవసరమయ్యే కరెంట్ చార్జీలు, ఉడ్చేపని మనిషి కోసం, స్టేషనరీ కొనుగోలుకు వినియోగించాలని ఆదేశించారు. 2021 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు ఈ నిధులు విడుదల చేయక పోవడంతో ఆయా మండలాల్లో ఉన్న 101 క్లస్టర్లలో పని చేస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారులు నిధులు రాక ఇబ్బందులు పడుతున్నారు. రైతు వేదికలకు ఉన్న కరెంట్ కనెక్షన్ చార్జీలు చెల్లించ లేకపోవడంతో ఒక్కొక్క క్లస్టర్ నుంచి ట్రాన్స్‌కో అధికారులకు రూ.20 వేల వంతున బాకీ ఉన్నట్లు తెలుస్తుంది. అదేవిధంగా ప్రతరోజు క్లస్టర్‌కు వచ్చే రైతుల కోసం శుభ్రంగా ఉంచడానికి వర్కర్‌కు ఏఈవోలే డబ్బులు చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉట్నూర్ ఏజెన్సీలోని ఉట్నూర్ మండలంలో షాంపూర్, దంతంపల్లి, ఉట్నూర్, శ్యామ్‌నాయక్ తండా, పులిమడుగు, తాంధ్ర, నర్సాపూర్(బి), ఉమ్రి, ఇంద్రవెల్లి మండలంలో కేస్లాపూర్, ఇంద్రవెల్లి, వాల్గొండ హీరాపూర్, ముత్నూనూరు, దోడంద, నార్నూర్ మండలంలో తాడిహత్నూర్, నార్నూర్, మహాగావ్, ఉమ్రి, బాబేఝరి, గాదిగూడ మండలంలో ఖండ్వా, గాదిగూడ, లోకారిలతో పాటు జిల్లావ్యాప్తంగా 101 క్లస్టర్ల వారీగా రైతు వేదికల నిర్మాణం నిర్మించిన అధికారులు నిధులు కేటాయించక పోవడంతో వ్యవసాయ విస్తరణ

(తరువాయి 4వ పేజీలో...)



### రైతు వేదికలకు నిధులు కేటాయించాలి

**: రితేష్‌రాథోడ్, బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు**



ఉమ్మడి జిల్లాలో రైతులకు సూచనలు సలహాలు ఇవ్వడానికి నిర్మించిన రైతు వేదికలకు ప్రభుత్వం నిధులు కేటాయించాలి. కాంట్రాక్టర్లు రైతు వేదికల పనులు పూర్తిచేయక పోవడంతో రైతు శిక్షణ శిబిరాలకు వెళ్తున్న రైతులకు మంచినీటి సౌకర్యం లేక పోగా మరుగుదొడ్ల సౌకర్యం కూడా లేక ఇబ్బందులు పడుతున్నారు.

### నిధుల కోసం ప్రతిపాదనలు పంపించాం

**: రమేష్ గిత్తే, మండల వ్యవసాయ అధికారి, ఉట్నూర్**



ఉట్నూర్ మండలంలో 8 క్లస్టర్ల వారీగా ప్రభుత్వం రైతు వేదికలు మంజూరు చేసింది. ప్రతినెల నిర్వహణ కోసం 9000 కేటాయిస్తామని చెప్పారు. కాని సరిగ్గా నిధులు విడుదల కాకపోవడంతో క్లస్టర్‌లలో పని చేస్తున్న ఏఈఓలకు నిర్వహణ నిధులు కేటాయించాలని జిల్లా అధికారుల ద్వారా ప్రతిపాదనలు పంపించడం జరిగింది. రైతు వేదికలకు కరెంట్ బకాయిలు పెరిగి పోయాయి.

---



మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును శాలువాతో సన్మానిస్తున్న డీసీసీబీ చైర్మన్

## మంత్రిని కలిసిన డీసీసీబీ చైర్మన్

ఆదిలాబాద్ అర్బన్, మే 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును ఆదివారం డీసీసీబీ చైర్మన్ అడ్డిభోజారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రైతు భరోసా, రైతులకు రాయితీ పైన వ్యవసాయ పనిముట్లు అందించాలని మంత్రిని కోరామని దీనికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి తెలిపారు. ఆయనతో పాటు టీఎస్‌సీఏబీ చైర్మన్ రవీంద్రరావు, వివిధ జిల్లాల డీసీసీబీ చైర్మన్‌లు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.



కాళేశ్వరంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు, మహిళలు

## సరస్వతీ పుష్కరాలకు కాళేశ్వరం తరలిన మండల ప్రజలు

జైనథ్, మే18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సరస్వతీ పుష్కరాలలో భాగంగా ఆదివారం జైనథ్ ఉమ్మడి మండంలోని ఆయా గ్రామాల ప్రజలు కాళేశ్వరం నదికి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా కాళేశ్వరం నదిలో ప్రత్యేక పుణ్య స్నానాలు ఆచరించి నవేద్యాలను సమర్పించారు. ప్రజలు రైతులు సకాలంలో వర్షాలు కురిసి పాడిపంట లతో చల్లంగా ఉండాలని శివపార్వతులను వేడుకున్నారు.ఈ కార్యక్రమంలో జైనథ్ మాజీ ఎంపీపీ ఎం.గోవర్ధన్ దంపతులతో పాటు జైనథ్ మండలంలోని ఆయా గ్రామ ప్రజలు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

### యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో

## ప్రధానమంత్రి దిష్టిబొమ్మ దహనం

ఉట్నూర్, మే18(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు ఎంపీ రాహుల్ గాంధీకి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి అక్రమ కేసులు పెట్టిన కేంద్ర ప్రభుత్వం చర్యలకు నిరసనగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను యువజన కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. రాహుల్‌గాంధీకి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేని మోదీ సర్కారు బిహార్ రాష్ట్రం దర్భాంగాలో అంబేద్కర్ హాస్టల్లో దళిత విద్యార్థులను రాహుల్‌గాంధీ కలవనీయకుండా కేంద్ర పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకుని రాహుల్‌గాంధీపై అక్రమ కేసులు పెట్టి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తున్నందున బీజేపీ ప్రభుత్వ నియంత పరిపాలనకు నిరసనగా ఆదివారం ఉట్నూర్ మండల కేంద్రంలో నియోజక వర్గం యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అరకిల్ల పరమేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా అరకిల్ల పరమేశ్వర్ రావు మాట్లాడుతూ రాహుల్ గాంధీకి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేని మోదీ సర్కార్ రాహుల్ గాంధీ పర్యటనలను అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. త్వరలోనే మతతత్వ బీజేపీకి దేశ ప్రజలు సరైన బుద్ధి చెప్పడం ఖాయమని ఆయన ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తిగిట్ల రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు అశోక్, కార్యదర్శులు, యువజన కాంగ్రెస్ నాయకులు గంగారాం, వినోద్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూర్‌లో ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

## సుంకిడిలో పేకాటరాయుళ్ల అరెస్టు

తలమడుగు, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకిడి గ్రామ శివారు ప్రాంతంలో ఏడుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ, సిబ్బందితో కలిసి పేకాట ప్రదేశంపైన దాడి చేయగా.. అందులో ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేయడం జరిగిందని, ఒక వ్యక్తి పారిపోయాడని తెలిపారు. అదే విధంగా దొరికిన ఆరుగురు వ్యక్తుల నుంచి రూ.1400, మూడు సెల్ ఫోన్, ఒక బైక్, 52 ప్లేయింగ్ కార్డ్స్ సీజ్ చేయడం జరిగిందని, కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్సై రాధికా తెలిపారు.

## విద్యుత్ షాక్‌తో ఎడ్ల మృత్యువాత

బోథ్, మే 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలోని కో ప్రైవేట్ పాఠశాల వెనక నుంచి ఎడ్లను తీసుకొని వస్తుండగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి. మధ్యాహ్నం సమయంలో యజమాని సుందేకర్ వంశీ ఎడ్లకు నీరు తాగించి తీసుకొస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. దీంతో యజమానికి దాదాపు లక్ష రూపాయల మేరకు నష్టం సంభవించినట్లు వాపోయారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ దుర్ఘటన చోటు చేసుకుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కష్టించి పంటను సాగు చేసుకునే రైతు ఈ సంఘటనతో కన్నీరు మున్నీరవుతున్నారు.



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఎడ్లు

## కిడ్నీ బాధితుల కుటుంబాలను ఆదుకుంటాం

- గ్రామానికి వెళ్లి పరామర్శించిన ఎమ్మెల్యే

బోథ్, మే 18(ఆంధ్రజ్యోతి): కిడ్నీ బారిన పడ్డ వారి కుటుంబాలను ఆదుకునేందుకు తమవంతుగా చేయూతను ఇస్తామని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని గండేపల్లి గ్రామానికి చెందిన తాడిపరచడం పెద్ది వినాయక బాధపడుతుండగా గ్రామానికి వెళ్లి ఆయన పరామర్శించారు. ఈ ప్రాంతంలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వారి సంఖ్య అధికంగా ఉందని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. కిడ్నీ బాధితులకు సాధ్యమైనంత లేనప్పుడు చేయూత అందిస్తామని అన్నారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ సంధ్యారాణి, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, సర్పంచ్ల సంఘం మాజీ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, బోథ్ మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, బిఆర్ఎస్ నాయకులు ఎలుక రాజు, నల్లగొండ ప్రశాంత్, మేడిచర్ల ప్రవీణ్, దేవేందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.



కండేపల్లి గ్రామంలో కిడ్నీ బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



హాల్ టికెట్‌లను పరిశీలిస్తున్న చీఫ్ సూపరింటెండెంట్

## ప్రశాంతంగా జేఈఈ ప్రవేశ పరీక్ష

మావల, మే 18(ఆంధ్రజ్యోతి): ప్రశాంతంగా జేఈఈ అడ్వాన్స్ ప్రవేశ పరీక్ష ఆదివారం జరిగింది. జిల్లా కేంద్రంలోని నలంద కళాశాలలో నిర్వహించారు. ఉదయం 9 గంటలకు నిర్వహించిన పరీక్షకు వంద మంది విద్యార్థులకు గాను 98 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు 95 మంది విద్యార్థులు హాజరయ్యై ఐదుగురు గైర్హాజర్ అయినట్లు సూపరింటెండెంట్ పున్నారావు ఈ సందర్భంగా తెలిపారు. ఇందులో పరిశీలకులు డాక్టర్ పంకజ్ కోలే, శ్రీకాంత్ ఊట్ల, తదితరులు ఉన్నారు.



గెలుపొందిన వారికి ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్యే

## యువతలో క్రీడా స్ఫూర్తిని నింపడమే లక్ష్యం : ఎమ్మెల్యే అనిల్ జాదవ్

సోనాల, మే 18(ఆంధ్రజ్యోతి): యువతలో క్రీడా స్ఫూర్తిని నింపడమే తమ లక్ష్యమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత ఇరవై రోజులుగా తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సోనాల ప్రీమియర్ లీగ్ తుదిపోరుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గెలుపొందిన చెన్నై సూపర్ కింగ్స్, రన్నరప్‌గా నిలిచిన లక్నో జట్టు అలాగే తృతీయ బహుమతిగా రాజస్థాన్ జట్లకు ట్రోఫీలను అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరు క్రీడాస్ఫూర్తిని పంపొందించుకోవాలని క్రీడల తోనే మానసిక శారీరక ఎదుగుదల ఉంటుందన్నారు.యువతకు నా ప్రోత్సాహం ఎల్లవేళలా ఉంటుందన్నారు. అలాగే టోర్నమెంట్ నిర్వహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు శ్రీధర్ రెడ్డి, సురేందర్ యాదవ్, నాయకులు యువకులు, తదితరులు పాల్గొన్నారు.



- పల్లకీ సేవ నిర్వహిస్తున్న హనుమాన్ దీక్షపరులు

## దేవాపూర్‌లో ఘనంగా బాల ఆంజనేయస్వామి పల్లకీ సేవ

తలమడుగు, మే 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవాపూర్ గ్రామంలోని శ్రీబాల ఆంజనేయ స్వామి ఆలయం నుంచిహనుమాన్ దీక్షా స్వాముల పల్లకీ సేవ (శోభాయాత్ర)ను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి వేంకటాద్రి, బీజేవైఎం మండల అధ్యక్షులు దాతజీ కిరణ్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడుచుకోవాలని వారు ఈ సందరంగా సూచించారు. ముఖ్యంగా యువత హనుమాన్ దీక్ష చేపట్టడం ఎంతో అభినందనీయమన్నారు. అంతకుముందు స్వామివారి పల్లకీ సేవ ప్రధాన వీధుల గుండా సాగగా.. మహిళలు హారతులు పట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భూమన్న, విట్టల్, లక్ష్మణ్ అండల్వార్, ఉడుగు రమేష్, ఎం. రమేష్, దాతజీ శ్రీనివాస్, సతీష్, గంగాధర్, విష్ణు, సాయి గణేష్, రవి, సందీప్, భూచన్న, హనుమాన్ స్వాములు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.